

పలమనేరులో ఘోర ప్రమాదం

పలమనేరులో ఐదుగురితో వెళుతున్న బైక్‌ను లారీ ఢీకొన్న సంఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. - 8లో



శేషుడిపై ద్రౌపదీదేవి విహారం

పుత్తూరులోని ద్రౌపదీదేవి ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అమ్మవారు శేష వాహనంపై విహరించారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	32	24
తిరుపతి	36	25
తిరుమల	32	22
గూడూరు	38	28
నగరి	37	26

న్యూస్‌రీల్

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

పుంగనూరు: పట్టణంలోని మైనారిటీల ఐటీఐ కోర్సుల్లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి కోరారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ సివిల్, వెల్డర్, డ్రాఫ్ట్స్‌మెన్, ఫ్యాషన్‌డిజైన్ టెక్నాలజీ కోర్సుల్లో మూడవ విడత అడ్మిషన్లు చేపట్టామన్నారు. ఈ కోర్సుల్లో చేరేందుకు పదోతరగతి పాస్, ఇంటర్ పాస్ లేదా ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 27లోపు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పంపాలని, 30న కౌన్సెలింగ్ ఉంటుందని సూచించారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

మోడల్ స్కూల్ పనులు వేగవంతం



మోడల్ స్కూల్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

రొంపిచెర్ల: స్థానిక మోడల్ స్కూల్ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్ అన్నారు. ఆయన సోమవారం నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తరగతి గదులు, హాస్టల్ భవనాల పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్ బ్రహ్మానందరెడ్డిని ఆదేశించారు. హాస్టల్ భవన పనులకు రూ.35 లక్షలు, తరగతి గదులకు మరో రూ.40 లక్షలు, సీసీ రోడ్డుకు రూ.10 లక్షలు, విద్యుత్ కనెక్షన్‌కు మరో రూ.18 లక్షలను మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పనులు పూర్తి చేసి భవనాలను అప్పగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, మండల అభివృద్ధి పనుల పర్యవేక్షకుడు మునితుకారం, తహసీల్దార్ అమరనాథ్, ఎంపీడీవో రాజేంద్ర, ఎంఈవో శ్రీనివాసులు, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సరళ, వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ శ్రీనాథ్, పీఆర్ఏఈ ఉమా మహేశ్వర్, వీఆర్వో మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జక్కదొనలో కేంద్ర బృందం



డంపింగ్ యార్డ్ పరిశీలిస్తున్న కేంద్రబృందం

వెదురుకుప్పం : మండలంలోని జక్కదొన పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులను కేంద్ర బృందం పరిశీలించింది. కేంద్ర బృందం సభ్యులు సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించి, పనులు పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా గ్రామాల్లో పర్యటించి అనేక అంశాలపై ఆరా తీశారు. ఇందులో భాగంగా జక్కదొన జెడ్పీ హైస్కూల్లో నాడు–నేడు పనులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ పనితీరుపై ఆరాతీశారు. ఎస్సీ, ఎస్టీ గ్రామల్లో పర్యటించి మరుగుదొడ్ల వాడకం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. వర్మీకంపోస్టు తయారీ ఇతర అంశాలకు సంబంధించి పలు సూచనలు సలహాలు అందించారు. కార్యక్రమంలో బాలసుబ్రమణ్యం, బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాను వినియోగించుకోండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 23న నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీవీకేఎన్‌లో నిర్వహించే జాబ్‌మేళాకు వివిధ కంపెనీలు విచ్చేస్తాయని తెలిపారు. ఇతర వివరాలకు 78931 10120, 63009 54441, 95056 01887ను సంప్రదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గుణశేఖర్, జిల్లా ఉద్యోగ ఉపాధి కల్పనా అధికారిణి పద్మజ, పీవీకేఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జీవన్‌జ్యోతి, డీఈవో విజయేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

‘నేత్రా’నందం



కళ్లుంటేనే ప్రకృతి అందాలను చూడగలం. జీవ జాలాన్ని గుర్తించగలం. భవిష్యత్‌ను నిర్దేశించే చూపు లేకపోతే జీవితం అంధకారమే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ బడుల్లో చదివే చిన్నారుల కోసం, వయసు మళ్లిన వారి కోసం ముఖ్యమంత్రి వైఎస్సార్ కంటి వెలుగు పథకాన్ని అమలు చేస్తున్నారు. అవసరమైన శస్త్రచికిత్సలు, కళ్లద్దాలు ఉచితంగా అందించి, నేత్రానందాన్ని ప్రసాదిస్తున్నారు.

- అంధకారానికి అద్దాల వెలుగు
- కంటి సమస్యలకు ఉచితంగా వైద్య పరీక్షలు
- శస్త్ర చికిత్సలు, కంటి అద్దాల పంపిణీ
- పక్కాగా వైఎస్సార్ కంటి వెలుగు

చిత్తూరు రూరల్: జ్ఞానేంద్రియానం నయనం ప్రధానం అనే సామెత మన కళ్లకున్న ప్రాధాన్యతను తెలియజేస్తుంది. మానవ శరీరంలో ముఖ్యమైనవి జ్ఞానేంద్రియాలైతే వాటిలో కళ్లు ప్రధానమైనవి. కంటి చూపు మందగిస్తే అడుగు ముందుకు వేయలేం. విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగుతుంది. భవిష్యత్తు అంధకారం అయ్యే ప్రమాదం ఉంది. కంటి సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులు, అవ్వాతాతల కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని దిగ్విజయంగా అమలు చేస్తోంది. వైఎస్సార్ కంటి వెలుగు



వృద్ధునికి కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

పథకం కింద నాలుగేళ్లుగా ఊరూరా, విద్యాలయాల్లో ఉచిత నేత్ర వైద్య శిబిరాలు నిర్వహిస్తోంది. నేత్ర సమస్యలతో బాధపడేవారికి ఉపశమనం కలిగించే యజ్ఞాన్ని నిర్విరామంగా కొనసాగిస్తోంది.

వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మొదటి, రెండు విడతలుగా పాఠశాలల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేశారు. కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. ప్రస్తుతం సాగుతున్న మూడో విడతలో అవ్వతాతలకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. వైద్య పరీక్షల కోసం అవ్వాతాతలు ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరం లేకుండా ఊరిలోనే వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వమే కంటికి వెలుగునిస్తోంది. జిల్లాలో చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, కుప్పం, పలమనేరు ఏరియా ఆస్పత్రుల్లో వైఎస్సార్ కంటి వెలుగు కింద పరీక్షలు చేసి ఉచితంగా ఆపరేషన్ చేయిస్తున్నారు. ఆపరేషన్ చేయించుకున్నవారికి కళ్ల అద్దాలను అందజేస్తున్నారు.



కుప్పం: కంటి పరీక్షల అనంతరం కళ్లజోళ్లు అందుకున్న విద్యార్థులు (ఫైల్)

ఫేజ్–1లో 6,138 పాఠశాలలోని 5,64,951 మంది పిల్లలకు స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఫేజ్–2 కింద 29,316 మంది విద్యార్థులను గుర్తించి, అందులో 10,360 మందికి పరీక్షలు చేసి కళ్లద్దాలు ఇచ్చారు. 85 మందిని ఆపరేషన్‌కు గుర్తించగా 19 మందికి శస్త్రచికిత్స చేసుకున్నారు. మూడో విడతగా 1,90,889 మంది అవ్వాతాతలకు స్క్రీనింగ్ చేశారు. వీరిలో 46,345 మందికి కళ్ల అద్దాలు అవసరమని గుర్తించారు. 2,150 మందికి కంటి పరీక్షలు చేయగా, మొత్తం 28,314 మందికి కళ్ల అద్దాలు పంపిణీ చేసినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి.

వృద్ధుల్లో ఇలా..

వృద్ధులైతే పౌష్టికాహారలోపం, వంశ పారంపర్యం, వయసు మీద పడడంతో కంటి పొరలు దెబ్బతిన డం, గ్లకోమా, బీపీ, మధుమేహం వల్ల రెటీనా దెబ్బతింటున్నాయి. ఇలాంటి కేసులకు వైఎస్సార్ కంటి వెలుగు కింద ఎక్కువ ఆపరేషన్లు జరుగుతున్నట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి

దృష్టి లోపాలకు చెక్

పిల్లలు, వృద్ధుల్లో తలెత్తే దృష్టి లోపాలను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమానికి మూడేళ్ల క్రితమే శ్రీకారం చుట్టింది. దాన్ని ప్రతి ఏటా క్రమంతప్పకుండా అమలు చేస్తోంది. విడతల వారీగా విద్యార్థులకు వృద్ధులకు కంటి పరీక్షలు, ఆపరేషన్ చేయిస్తూ కంటి అద్దాలు పంపిణీ చేస్తోంది. దీంతో వృద్ధులు, పిల్లలు కంటి సమస్యల నుంచి విముక్తి పొందుతున్నారు

కంటి సమస్యలకు కారణాలు



- ఆహారంలో సమతుల్యత లోపం
- జన్యుపరమైనవి
- పుట్టుకతో వచ్చేవి

సమస్యలు ఇవే

- కంటిలో గుల్లలు
- పొరలు
- శుక్లాలు
- రేచీకటి
- కన్నుగుడ్డు సమస్య
- మెల్లకన్ను
- కార్నియా

ఉచితంగా ఆపరేషన్



నాకు కళ్లు సరిగా కనిపించడం లేదు. కంటి వెలుగు కింద డాక్టర్లు పరీక్షలు చేసి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పైసా ఖర్చు లేకుండా ఆపరేషన్ చేశారు. అవసరమైతే కంటి అద్దాలు కూడా ఉచితంగానే ఇస్తామంటున్నారు. మాకు మళ్లీ చూపునివ్వడం మంచి కార్యక్రమం.

– అబ్బోజయ్య, తవణంపల్లె

సీఎంకు రుణపడి ఉంటాం



చూపు మందగించిందని జిల్లా ఆస్పత్రికి వచ్చాను. ఇక్కడ డాక్టర్లు కంటి పరీక్షలు చేసి రెండు రోజుల పాటు పరిశీలనలో ఉంచారు. కంటి వెలుగు కింద రూపాయి ఖర్చు లేకుండా ఆపరేషన్ చేశారు. రెండు రోజుల్లో డిశ్చార్జ్ చేస్తామంటున్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్న సీఎంకు రుణపడి ఉంటాం.

– అలివేలమ్మ, బంగారుపాళెం

వెలుగును నింపుతోంది



వైఎస్సార్ కంటి వెలుగు అవ్వాతాతల్లో వెలుగులు నింపుతోంది. ఇప్పటికే రెండు విడతలుగా విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించాం. ఇప్పుడు మూడో విడత కొనసాగుతోంది. 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు కంటి పరీక్షలు చేసి, కళ్ల అద్దాలు ఇస్తున్నాం. ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలను భాగస్వాములను చేశాం.

– మాధవి, కంటి వెలుగు మేనేజర్, చిత్తూరు

పెత్తందారులకు–పేదలకు

మధ్యనే పోటీ



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం) : రానున్న ఎన్నికల్లో పెత్తందారులకు–పేదలకు మధ్యనే పోటీ ఉంటుందని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం గంగుపల్లి సచివాలయ పరిధిలోని కేపీ వడ్డిపల్లిలో ఆయన పర్యటించారు. పెనుమూరు వెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కేపీ వడ్డిపల్లిలో వెలుగు సిబ్బంది ఏర్పాటు చేసిన థ్యాంక్యూ సీఎం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న వెలుగు(సెర్ప్)ఉద్యోగస్తులకు 23 శాతం జీతాలు పెంచి వారి జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎంలు చిరంజీవి, రోజా, కవిత, విజయ్‌కుమార్, ఫరీద్‌మస్తాన్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 79,444 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,744 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. హుండీ ద్వారా రూ. 4.21 కోట్ల ఆదాయం వచ్చింది. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

న్యాయవాదుల సంఘం భవన పనులు ప్రారంభం



పుంగనూరులో న్యాయవాదుల భవన పనులను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: పట్టణంలోని కోర్టు ఆవరణలో న్యాయవాదుల సంఘ భవన నిర్మాణ పనులను మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్పతో కలసి సోమవారం ప్రారంభించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గల్లా శివశంకర్‌నాయుడు, న్యాయవాదులు కలసి మంత్రి పెద్దిరెడ్డికి పూర్ణకుంభ స్వాగతం పలికి, గజమాలతో సత్కరించారు. అనంతరం ఆయన భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా న్యాయవాదులు ఐకమత్యంతో ఉండడం అభినందనీయమన్నారు. న్యాయవాదుల కోరిక మేరకు ఈ భవనం నిర్మించేందుకు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి నిధుల నుంచి రూ.25 లక్షలు, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప నిధుల నుంచి రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, న్యాయవాదులు ఆనందకుమార్, ఆకుల చెన్నకేశవులు, సుధాకర్ రెడ్డి, బాలాజీకుమార్, మల్లికార్జునరెడ్డి, హితేంద్ర, విజయకృష్ణ, అయూబ్, రవీంద్రరెడ్డి, హరినాథ రెడ్డి, పులిరామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మాటల్లో కాదు.. చేతల్లోనే అభివృద్ధి

- మిట్టపాళెంలో రూ.90 లక్షల పనులు ప్రారంభం
- జగనన్న సుపరిపాలనకు సాక్ష్యాలు సచివాలయాలు
- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా



ప్రారంభించిన భవనాల ముందు మంత్రి ఆర్‌కే రోజా

నగరి: అభివృద్ధి మాటల్లో కాదు.. చేతల్లో చూపుతున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. మండలంలోని మిట్టపాళెంలో సోమవారం ఒకే ప్రాంగణంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.21.8 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, ఎన్‌ఆర్‌ఈజీఎస్, రూ.20.8 లక్షల ఎన్‌హెచ్‌ఎం నిధులతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్, స్వచ్ఛభారత్ నిధులు రూ.3 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్, జిల్లా పరిషత్ నిధులు రూ.2.5 లక్షలతో ఏర్పాటు చేసిన తాగునీటి బోర్లను ఆమె ప్రారంభించారు. ఇంతటి అభివృద్ధిని తమ గ్రామానికి చేసిన మంత్రికి స్థానిక మహిళలు కర్పూర హారతులు పట్టారు. గజమాలలతో సత్కరించారు.

కళ్లెదుటే అభివృద్ధి

గతంలో టీడీపీ ప్రభుత్వం అభివృద్ధిని కాగితాలకే పరిమితం చేస్తూ ప్రజలను ఏమార్చిందని మంత్రి రోజా గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధిని కళ్లకు కట్టినట్లు ప్రత్యక్షంగా ప్రజలకే చూపుతోందని స్పష్టం చేశారు. అందులో భాగంగానే మిట్టపాళెంలో ఒకే ప్రాంగణంలో రూ.90 లక్షల మేర అభివృద్ధి పనులు ప్రారంభించామని చెప్పారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో ప్రజల చెంతకే పాలనను జగనన్న తీసుకొచ్చారని చెప్పారు. గ్రామంలోని రైతులకు పరిపాలనకు సచివాలయం, వ్యవసాయ సంబంధిత సమస్యల పరిష్కారానికి రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య రక్షణకు వెల్‌నెస్ సెంటర్, తాగు నీటి సరఫరాకు బోరు, ఈ కేంద్రాలకు విచ్చేసే వారి సౌకర్యార్థం కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ ఒక ప్రాంగణంలో ఉందంటే ఇది నిజమైన అభివృద్ధి అన్నారు. సచివాలయ పరిధిలోని మేళపట్టు, మిట్టపాళెం గ్రామస్తులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ అభివృద్ధి పనులు, భవనాలన్నీ ప్రజలమీద జగనన్నకు ఉన్న ప్రేమాభిమానాలకు సాక్ష్యాలన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్, జెడ్పీ నిధులు, ఎమ్మెల్యే నిధులు, గడపగడపకు నిధులు అంటూ సుమారు రూ.కోటి మేర అభివృద్ధికి వినియోగిస్తున్నామని తెలిపారు. ఇలా మంచి చేసే ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, ఎంపీడీఓ లీలామాధవి, పీఆర్ డీఈ సుబ్బరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సతీష్ కుమార్, సీడీపీఓ కృష్ణవేణి, ఎంఈఓ శ్రీదేవి, ఏఈలు సురేంద్రబాబు, శైలేంద్ర, వైద్యాధికారి రమేష్, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, మండల కన్వీనర్ సుదర్శననాయుడు, మండల సచివాలయ కన్వీనర్ హరి, సర్పంచ్ పరంధామన్, ఏఈలు జ్ఞాన కుమార్, మురుగానందన్, నాయకులు వినోద్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



గరుడ పంచమిని పురస్కరించుకుని సోమవారం రాత్రి తిరుమలలో గరుడోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. - తిరుమల

ప్రజాసమస్యలకు ప్రాధాన్యమివ్వండి



డీఆర్‌వో రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజాసమస్యలకు ప్రాధాన్యమివ్వాలని డీఆర్‌ఓ రాజశేఖర్ వెల్లడించారు. కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో నమోదయ్యే అర్జీలను సత్వరం పరిష్కరించాలన్నారు. ఈ నెల 1 నుంచి 20వ తేదీ వరకు 1,945 అర్జీలు స్పందనలో నమోదైనట్లు తెలిపారు. ఇందులో 1,266 అర్జీలు పరిష్కరించినట్లు చెప్పారు. మిగిలిన 679 అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ నెల 28న జరిగే జగనన్న విద్యాదీవెన కార్యక్రమానికి ఈకేవైసీ 87 శాతం పూర్తి చేసినట్లు వివరించారు. మిగిలిన 13 శాతం ఈకేవైసీ త్వరితగతిన పూర్తి చేసేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల సేవలకు సంబంధించిన పబ్లిక్ టెలిగ్రాంను అధికారులందరూ తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పేదలందరికీ ఇళ్లు పథకం పురోగతిలో వెనుకబడిన మండలాలు పురోగతిని సాధించాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల అధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి , గంగాభవాణి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

24లోపు అభ్యంతరాలు తెలపండి

చిత్తూరు కలెక్టరేట్ : దరఖాస్తు జాబితాలో ఏవైనా అభ్యంతరాలుంటే, ఈ నెల 24వ తేదీ లోపు తెలపాలని జిల్లా ఉపాధి కల్పనా శాఖ అధికారిణి పద్మజ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల జాబితా చిత్తూరు ఉపాధి కార్యాలయం నోటీస్ బోర్డులో పెట్టినట్లు పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న రికార్డు అసిస్టెంట్ 2 పోస్టులకు అర్హతగా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత, అటెండర్ 07, ఆఫీస్ సబార్డినేట్ 01 పోస్టులకు ఇంటర్మీడియట్ ఫెయిల్ విద్యార్హతగా మార్చినట్లు తెలిపారు. ఇందులో ఏవైనా అభ్యంతరాలుంటే అభ్యర్థులు లిఖిత పూర్వకంగా అందజేయాలని పేర్కొన్నారు.

అర్జీలు సకాలంలో పరిష్కరించండి



వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : స్పందన అర్జీలు సకాలంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. స్పందనలో నమోదయ్యే అర్జీలకు నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. పరిష్కారంలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పందనలో వివిధ శాఖలకు సంబంధించి 219 అర్జీలు నమోదైనట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో రాజశేఖర్, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

24న చిత్తూరులో ఎక్సైజ్ వాహనాల వేలం

చిత్తూరు అర్బన్: మద్యం తరలిస్తూ చిత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) రూరల్ పరిధిలో పట్టుబడిన వాహనాలను ఈనెల 24వ తేదీ వేలం పాటలో విక్రయించనున్నట్లు సీఐ చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. మిట్టూరులోని ఎస్‌ఈబీ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు జరిగే వేలం పాటలో పాల్గొనేవాళ్లు ముందుగా రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. రెండు ద్విచక్ర వాహనాలు, ఓ ఇండికా కారును వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు.

పలమనేరులో ఘోర ప్రమాదం

- ద్విచక్రవాహనాన్ని ఢీ కొన్న లారీ
- బైక్‌పై ఐదుగురి ప్రయాణం
- ఒకరి దుర్మరణం
- లారీ డ్రైవర్‌ను చితకబాదిన స్థానికులు





పోలీసుల అదుపులో నిందితుడు సురేష్, సంఘటన స్థలంలో మృతి చెందిన సద్దాం



సద్దాం (ఫైల్)

పలమనేరు: పట్టణంలోని రంగబాబు సర్కిల్లో సోమవారం సాయంత్రం ఒళ్లు గగుర్పొడిచే రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఐదుగురు కుటుంబ సభ్యులతో ప్రయాణిస్తున్న బైక్‌ను లారీ ఢీకొని, వారిపై నుంచి దూసుకెళ్లిన సంఘటన విషాదాన్ని మిగిల్చింది. బైక్ నడుపుతున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన నలుగురూ ప్రాణాలతో బయటపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.

పట్టణంలోని రంగాపురానికి చెందిన సద్దాం(27) కదిరప్ప ఆస్పత్రి ఎదురుగా చికెన్ స్టాల్‌ను రెండ్రోజుల క్రితం ప్రారంభించాడు. కుటుంబీకుల సహకారంతో దుకాణం నిర్వస్తున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం దుకాణం నుంచి సద్దాం, భార్య రుక్సార్, అత్త ఫాతిమా, తన ఇద్దరు పిల్లలతో బైక్‌పై ఇంటికి రాంగ్ రూట్‌లో బయలుదేరాడు. రంగబాబు సర్కిల్ వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా పలమనేరు వైపు ఇనుప కమ్మీతో వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ ట్యాంక్‌పై కూర్చున్న సద్దాం కుమార్తె సారా హార్మీన్(04) లారీ కింద మధ్యలో పడి స్వల్పగాయాలతో బయటపడింది. బైక్‌పై వెనుక కూర్చున్న భార్య రుక్సార్(25), ఆమె తల్లి ఫాతీమా(55), భార్య చంకలోని 11నెలల చిన్నారి అలియా పక్కనే ఉన్న డివైడర్‌పై పడడంతో ప్రాణాలు దక్కించుకున్నారు. లారీ చక్రాల కింద పడిన సద్దాం తల ఛిద్రమై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. రద్దీ ప్రాంతం కావడంతో క్షణాల్లో వంద మందికిపైగా గుమిగూడారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ ఇంజిన్ కూడా ఆఫ్ చేయకుండానే లారీలోంచి దూకి పారిపోతుండగా, స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. నిందితుడిని మండలంలోని గొల్లపల్లికి చెందిన డ్రైవర్ సురేష్‌గా పోలీసులు గుర్తించారు. స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో లారీ ట్రైర్లను మార్చి బైపాస్ మీదుగా వచ్చి పట్టణం గుండా ట్రయల్స్ నిర్వహిస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని డ్రైవర్ సురేష్ అంగీకరించాడు. ఎస్ఐ సహదేవి సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,460
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.79.00

జిల్లాలో నలుగురు సీఐల బదిలీ

చిత్తూరు అర్బన్: ఉమ్మడి జిల్లాలో నలుగురు సీఐలను బదిలీ చేస్తూ సోమవారం రాష్ట్ర పోలీసుశాఖకు ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం జిల్లా వీఆర్‌లో పనిచేస్తున్న రాఘవరెడ్డిని పుంగనూరు అర్బన్‌కు, అనంతపురం జిల్లా వీఆర్‌లో ఉన్న రామక్రిష్టారెడ్డిని కుప్పం అర్బన్‌కు బదిలీ చేశారు. చిత్తూరు వీఆర్‌లోని సత్యాబాబును నగరి సర్కిల్‌కు, తిరుపతి పీసీఆర్‌లోని సురేంద్రనాథ్‌రెడ్డిని భాకరాపేట సర్కిల్‌కు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

తిరుపతి అర్బన్ : జిల్లాలోని 132 వార్డు, గ్రామ సచివాలయాల్లో మంగళవారం నుంచి ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేయనున్నారు. అలాగే మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లో మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నారు. ఈ నెల 25వ తేదీ వరకు క్యాంపులు కొనసాగించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో ప్రధానంగా ఆధార్ కార్డు నమోదు, 5– 15ఏళ్ల బాల బాలికలకు బయోమెట్రిక్ అప్‌డేట్ సేవలు చేపట్టనున్నారు. ఈ క్రమంలో ఆధార్ కార్డ్ ప్రింట్ కోసం రూ. 30, ఇంటి చిరునామా మార్పునకు రూ.50, ఇంటి చిరునామాతో పాటు బయోమెట్రిక్ అప్‌డేట్ కోసం రూ.100 రుసుము చెల్లించాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 2010–16 మధ్య ఆధార్ నమోదు చేసుకుని, తర్వాత ఒక్కసారి కూడా అప్‌డేట్ చేసుకోని వారు తప్పనిసరిగా ఏదైనా రుజువు సమర్పించి తమ ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకోవాలని అధికారులు వెల్లడిస్తున్నారు. అలాగే పాత జిల్లాల పేర్లను తిరుపతి జిల్లాగా మార్చుకునే అవకాశం సైతం కల్పించామని వివరిస్తున్నారు.



ఆధార్ సేవలు పొందుతున్న లబ్ధిదారులు (ఫైల్)

సద్వినియోగం చేసుకోండి

ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. తప్పులు లేని ఆధార్ కార్డు తీసుకుంటే సంక్షేమ పథకాల సమయంలో ఇబ్బంది లేకుండా ఉంటుంది. గత ఏడాది జూన్ నుంచి వరుసగా ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నాం. వలంటీర్ల ద్వారా సచివాలయాలకు వెళ్లి పక్కాగా ఆధార్‌లో వివరాలు నమోదు చేయించుకోవాలి.

- వెంకటరమణారెడ్డి, కలెక్టర్

పసికందు మృతిపై షోకాజ్ నోటీసులు

చిత్తూరు రూరల్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పసికందు మృతిపై ఇద్దరికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు షోకాజు నోటీసులు జారీ చేశారు. చిత్తూరు నగరంలోని ఖాదర్‌మీనాన్ వీధికి చెందిన సర్దామ్ భార్య రోష్ని జూలైలో మగబిడ్డకు జన్మనిచ్చింది. 12 రోజుల కిందట శిశువు గొంతు కింద చిన్న గడ్డ ఏర్పడిందని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. డాక్టర్ల సూచనల మేరకు ఆస్పత్రిలోనే బిడ్డను అడ్మిట్ చేశారు. అయితే యాంటీబయాటిక్ ఇంజెక్షన్ ఇవ్వడం వల్ల శరీరం కట్టిబారిపోయి తమ బిడ్డ మృతి చెందాడని తల్లిదండ్రులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆస్పత్రిలో విచారణ ప్రారంభించారు. ఈ విచారణలో నిర్లక్ష్యం ఉందని గుర్తించిన అధికారులు డ్యూటీ డాక్టర్, సిబ్బందికి షోకాజు నోటీసులు ఇచ్చారని ఆస్పత్రి అధికారులు పేర్కొన్నారు.

శేష వాహనంపై ద్రౌపదీదేవి విహారం



గెరిగను ఊరేగింపుగా తీసుకువస్తున్న గ్రామస్తులు

పుత్తూరు రూరల్: ద్రౌపదీదేవి సమేత ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శేష వాహనంపై ద్రౌపదీదేవి సమేత అర్జున స్వామి విహరించారు. ఇంటింటా భక్తులు కర్పూరహారతులిచ్చారు. బ్రహ్మోత్సవాల అర్చక స్వామి హేమాచల్‌బాబు ఆధ్వర్యంలో పోతురాజు రక్షకుడిగా ముందు నడుస్తూ గెరిగ ఆలయానికి చేరుకుంది. గెరిగ నీటితో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. స్వామి అమ్మవార్లను విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 11 గంటలకు స్థానిక హరిజన సంఘం ఆధ్వర్యంలో ద్రౌపదీదేవి సమేత అర్జునస్వామి తిరువీధుల్లో ఊరేగింపు జరిగింది. సాయంత్రం 4 గంటలకు బకాసుర వధ ఘట్టాన్ని కోలాహలంగా నిర్వహించారు. రాత్రి శేష వాహన సేవ కె.విశ్వనాథంపిళ్లై కుమారుల ఆధ్వర్యంలో కనుల పండువగా సాగింది. ఆలయ కమిటీ చైర్మన్ లారీమోహన్, సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

నేడు పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి

పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సెల్వమణి దంపతులు మంగళవారం సాయంత్రం 4 గంటలకు అమ్మవారికి పట్టువస్త్రాలు, మాంగల్యం సమర్పించనున్నారు. ఉదయం 9 గంటలకు పల్లకి సేవ, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం, సాయంత్రం 6 గంటలకు మత్స్యయంత్ర ఛేదన, అమ్మవారి కళ్యాణోత్సం నిర్వహించనున్నారు. రాత్రి అశ్వ వాహనంపై అమ్మవారి ఊరేగింపు ఉంటుంది.

గుండెపోటుతో అర్చకుడి మృతి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో అర్చకుడుగా విధులు నిర్వహిస్తున్న శ్రీపాదరావు గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. ఇంటి వద్ద ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అర్చకుడి మృతికి ముక్కంటి ఆలయ అధికారులు, సిబ్బంది సంతాపం తెలిపారు.

310 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

తడ: అక్రమంగా తరలిస్తున్న 310 బస్తాల తమిళనాడుకు చెందిన రేషన్ బియ్యాన్ని తిరుపతి విజిలెన్స్, సివిల్ సప్లయ్ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లయ్ డీటీ బీ.ఓబయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. విజిలెన్స్ అధికారులతో కలిసి చేనిగుంట గ్రామం సమీపంలోని రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద అనుమానాస్పదంగా వెళుతున్న లారీని తనిఖీ చేయగా అందులో రూ.4.82 లక్షల విలువ చేసే 310 బస్తాల తమిళనాడు రేషన్ బియ్యం కనిపించింది. దీంతో ఏ–1 ముద్దాయిగా ఉన్న బియ్యం వ్యాపారి విజయ్‌కుమార్‌ని అదుపులోకి తీసుకోవడంతోపాటు లారీ ఓనర్ ఎస్‌కే.జమాల్‌బాషా, మరో ఇద్దరు వ్యాపారులు ఎం.ప్రసాద్, సిద్ధారెడ్డిపై కేసు నమోదు చేశారు. పట్టుబడ్డ బియ్యం కొండూరులోని సివిల్ సప్లయ్ గోదాములో భద్రపరిచారు.

కలెక్టర్‌ను కలిసిన నూతన ఎక్సైజ్ సూపరింటెండెంట్

చిత్తూరు కలెక్టరేట్ : నూతనంగా జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులు నాయుడు సోమవారం కలెక్టర్‌ను కలిశారు. మార్కాపురం నుంచి చిత్తూరుకు బదిలీపై విచ్చేసిన ఆయన కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీనివాసులునాయుడు

తిరుమల ఘాట్‌లో ప్రమాదం

తిరుమల : తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో సోమవారం ఓ టెంపో అదుపు తప్పి రక్షణ గోడను ఢీకొంది. వివరాలు.. తమిళనాడుకు చెందిన భక్తులు శ్రీవారి దర్శనార్థం టెంపో ట్రావెలర్‌లో తిరుమలకు వచ్చారు. దర్శనానంతరం కిందకు దిగుతుండగా 13వ మలుపు వద్ద ప్రమాదం జరిగింది. దీంతో వాహనంలోని ఐదుగురు ప్రయాణికులు గాయపడ్డారు. ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తిరుపతి రుయాకు తరలించారు.

తక్షణం పరిష్కరించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీలు

చిత్తూరు అర్బన్: స్పందన ద్వారా వచ్చే అర్జీలపై తక్షణం స్పందించాలని అడిషనల్ ఎస్పీలు సుధాకర్, శ్రీలక్ష్మి ఆదేశించారు. చిత్తూరులోని ఆర్మ్డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో వారు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇందులో వేధింపులు 2, కుటుంబ తగాదాలు 4, చీటింగ్ 2, ఇంటి తగాదాలు 2, భూ తగాదాలు 8, ఆస్తి తగాదాలు 4, డబ్బు తగాదాలు 5, భూ తగదాలు 3 చొప్పున ఫిర్యాదులు వచ్చాయి. ఆయా ఎస్ఐలతో అడిషనల్ ఎస్పీలు వీడియో సమావేశంలో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. స్పందనలో వచ్చే వినతులను క్షేత్రస్థాయిలో నేరుగా పరిశీలించి తనకు నివేదిక ఇవ్వాలని సూచించారు.

విశిష్టం.. సనాతన హైందవ ధర్మం



కార్యక్రమంలో మాట్లాడుతున్న టీటీడీ జేఈఓ సదాభార్గవి

తిరుపతి కల్చరల్ : ప్రపంచంలోని అన్ని ధర్మాల్లో సనాతన హైందవ ధర్మం విశిష్టమైందని టీటీడీ జేఈఓ సదా భార్గవి తెలిపారు. సోమవారం తిరుపతి ఎస్వీయూ స్టేడియంలో కోటి హనుమాన్ చాలీసా పారాయణ మహా యజ్ఞం రథ యాత్రను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ సనాతన హైందవ ధర్మప్రచారానికి టీటీడీ పెద్దపీట వేస్తోందన్నారు. మహా యజ్ఞం రథాలు ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో 2024 జనవరి 20వ తేదీ వరకు విస్తృత ప్రచారం చేస్తాయని వెల్లడించారు. అనంతరం తిరుమలలో జనవరి 21న కోటి హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నట్లు వివరించారు. ఇందుకోసం టీటీడీ రూ.1.5 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీహనుమాన్ దీక్ష పీఠం స్వామీజీ దుర్గాప్రసాద్, విశ్వహిందూ పరిషత్ జాతీయ కార్యదర్శి రాఘవులు, డీపీపీ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు రేణిగుంట గంగ జాతర

- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

రేణిగుంట: రేణిగుంట గంగ జాతర మహోత్సవానికి సర్వం సిద్ధమైంది. జాతర మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించేందుకు ఆలయ చైర్మన్ సోలా మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు, అమ్మవారి దర్శనార్థం ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశారు. మంగళవారం జాతర మహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సామూహిక పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించనున్నారు. అనంతరం అమ్మవారి విశ్వరూప దర్శనానికి భక్తులను అనుమతించనున్నారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణమే కాకుండా పట్టణంలోని ప్రధాన వీధుల్లో దేవతామూర్తుల ప్రతిమలతో కూడిన విద్యుత్ దీపాలంకరణ ఆకట్టుకుంటోంది.



ఆలయం ఎదుట ఏర్పాట్లు



అమ్మవారు



పటిష్టమైన బందోబస్తు

రేణిగుంట జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశాం. రెండు రోజులు ఇతర స్టేషన్ల నుంచి పోలీసు సిబ్బందిని ఇక్కడ జాతర సందర్భంగా విధులకు కేటాయించాం. ముఖ్యంగా ట్రాఫిక్ మళ్లింపు, పట్టణంలో ట్రాఫిక్ ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. **- భవ్యకిషోర్, డీఎస్పీ, రేణిగుంట**